
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జయశంకర్ భూపాలపల్లి

5

ములుగు

గురువారం 25 జనవరి 2024

మోస్ట్ రిచెస్ట్

ధనిక జిల్లాగా భూపాలపల్లి



భూపాలపల్లి జిల్లా కేంద్రం వ్యూ

- ప్రణాళికా సంఘం సర్వేలో వెల్లడి
- తలసరి ఆదాయం రూ.2,23,481తో పదో స్థానంలో ఉందని నిర్ధారణ
- ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ప్రథమం
- పర్యాటకం, పరిశ్రమలే ప్రధాన వనరులు

భూపాలపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాకు అరుదైన గుర్తింపు దక్కింది. తెలంగాణలోని 10 అత్యంత ధనిక జిల్లాల్లో చోటు సంపాదించుకుంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ప్రజలు ఏ జిల్లాలో అత్యధికంగా ఆదాయం పొందుతున్నారో ప్రణాళికా సంఘం సర్వే చేపట్టింది. దాని ఆధారంగా నివేదికను తయారు చేసింది. జిల్లాలో ఏడాదికి ప్రతి వ్యక్తి సగటున ఆర్జించే ఆదాయం ప్రాతిపాదికన తలసరి ఆదాయాన్ని నిర్ధారిస్తారు. ఇలా మోస్ట్ రిచెస్ట్ డిస్ట్రిక్ట్‌లో భూపాలపల్లి జిల్లా పదో స్థానంలో ఉందని ప్రణాళికా సంఘం పేర్కొంది. మొదటి స్థానం రంగారెడ్డి జిల్లాకు దక్కింది. ఇక్కడ తలసరి ఆదాయం రూ.8,15,996 ఉంది. హైదరాబాద్ జిల్లా తలసరి ఆదాయం రూ.4,03,214తో రెండో స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో సంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం రూ.3,08,166గా ఉంది. నాలుగో స్థానంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రూ.2,58,040 తలసరి ఆదాయం ఉండగా ఐదో స్థానంలో యాదాద్రి భువనగిరి రూ.2,47,184 ఉంది. నల్లగొండ జిల్లా తలసరి ఆదాయం రూ.2,42,103తో ఆరోస్థానంలో ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా రూ.2,40,900తో ఏడోస్థానం, మెదక్ జిల్లా రూ.2,32,384తో ఎనిమిదో స్థానం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రూ.2,28,582తో తొమ్మిదో స్థానంలో ఉంది. కోల్‌బెల్ట్, ఏజెన్సీ ప్రాంతంగా ఉన్న భూపాలపల్లి జిల్లా తలసరి ఆదాయం రూ.2,23,481 ఉండగా పదో స్థానం దక్కించుకుంది. ఉమ్మడి వరంగల్‌లో ఆరు జిల్లాలు ఉండగా భూపాలపల్లి మాత్రమే అత్యంత ధనిక జిల్లాగా ప్రణాళికా శాఖ పేర్కొనడం విశేషం.

హనుమకొండ కంటే పైచెయ్యే..

వరంగల్, కరీంనగర్ జిల్లాలోని మండలాల నుంచి విడిపోయి 2016 అక్టోబరు 11న భూపాలపల్లి జిల్లా ఏర్పడింది. ప్రస్తుత ప్రణాళికా సంఘం లెక్కల ప్రకారం హనుమకొండ, వరంగల్, కరీంనగర్ కంటే భూపాలపల్లి జిల్లా వాసులే అత్యంత ఆదాయం పొందుతున్నారు. ప్రణాళికా సంఘం నివేదికలో టాప్ టెన్ రిచెస్ట్ జిల్లాల్లో హనుమకొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చోటు దక్క లేదు. హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా ఉన్న వరం గల్ మహానగర వాసుల తలసరి ఆదాయం టాప్ టన్‌లో లేకపోవడం చర్చనీయంశంగా మారింది. కొత్త గా ఏర్పడిన భూపాలపల్లి జిల్లాలో బొగ్గు, విద్యుత్, ఇసుక తదితర పరిశ్రమలు ఉండటంతో ఉపాధి మార్గాలను వెతుక్కుంటూ చాలా మంది వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్నారు. కోల్‌బెల్ట్ కేంద్రంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రిచెస్ట్ డిస్ట్రిక్ట్ జాబితాలో తొమ్మిదో స్థానంలో ఉండగా భూపాలపల్లికి 10వ స్థానం దక్కింది. సింగరేణికి కీలకమైన మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలకు కూడా ఈ జాబితాలో చోటు లభించలేదు. దీంతో సింగరేణి ఆదాయం పొందే ఉద్యోగులే కాకుండా ఇతర వర్గాల ఆదాయాలను పరిగణనలోకి తీసుకొని ఈ జాబితాను తయారు చేశారని తెలిసింది.



బొగ్గుబావిలో కార్మికులు



చెల్పూరులోని కేటీపీపీ

పరిశ్రమలు.. పర్యాటకం వల్లే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు మండలాలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఐదు మండలాలతో భూపాలపల్లి జిల్లా కొనసాగుతోంది. లక్షకు పైగా జనాభా ఉండటంతోపాటు భూపాలపల్లి పట్టణం చెల్పూరు వరకు విస్తరించింది. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా వలస వస్తుండటంతో కొత్తగా గృహ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. రియల్ ఎస్టేట్ కూడా మొన్నటి వరకు జోష్‌లోనే ఉంది. ఉపాధి అవకాశాలు మెండుగా ఉండటంతో తక్కువ కాలంలోనే భూపాలపల్లి ఎక్కువ అభివృద్ధి చెందుతోందని తెలుస్తోంది.

జిల్లాలో సింగరేణితోపాటు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం ఉంది. ఈ రెండు పరిశ్రమల్లో సుమారు 9 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. మరో 5 వేల మంది ఈ పరిశ్రమల ఆధారంగా జీవనం పొందుతున్నారు. అయితే వీటితో కేటీపీపీ యాష్ ఆధారంగా బ్రిక్స్ తయారీతోపాటు ఇతర కుటీర పరిశ్రమలను సింగరేణి ఆధారం ఇక్కడ ప్రజలు ఏర్పాటు చేసుకొని ఆదాయం పొందుతున్నారు. గోదావరి ఇసుకతో కూడా ట్రాన్స్‌పోర్టు పెరిగింది. వీటితోపాటు జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టు, పాండవుల గుట్టలు పర్యాటక కేంద్రాలుగా ఉన్నాయి. కాళేశ్వరాలయం, కోటవటంచ, గణపేశ్వరాలయం తదితర దేవస్థానాలను భక్తులు సందర్శించనుండంతో వీటి ఆధారిత పరిశ్రమలు, షాపులు ఏర్పడుతున్నాయి. వీటితోపాటు జిల్లాలో ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడే ఎక్కువ మంది జీవనం సాగిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కువ మిర్చి, పత్తి పంటలు పండించే జిల్లాల్లో భూపాలపల్లి ఒక్కటి. గోదావరి తీర మండలాల్లో మిర్చి పంట ఎక్కువ సాగు అవుతోంది. ఇక్కడ సింగరేణి, కేటీపీపీలో పనిచేసే ఉన్నత ఉద్యోగులకు వేతనాలు కూడా భారీగా ఉన్నాయి. వేగంగా అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లిలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మరింత జిల్లా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. రైల్వే మార్గం ఏర్పాటు చేస్తే అభివృద్ధితో ముందుకు దూసుకెళ్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి టాప్ టెన్ రిచెస్ట్ జిల్లాల్లో భూపాలపల్లికి చోటు దక్కడం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఎయిర్‌పోర్ట్ స్థాయిలో కాజీపేట రైల్వేస్టేషన్ అభివృద్ధి

రూ.20కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం..

దక్షిణ మధ్య రైల్వే జీఎం అనిల్‌కుమార్ జైన్

రైల్వే పాలిక్లినిక్ అప్‌గ్రేడెడ్ ఆస్పత్రికి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న రైల్వే జీఎం అనిల్‌కుమార్ జైన్



ఆస్పత్రి శిలాఫలకాన్ని శంకుస్థాపన చేస్తున్న జీఎం

కాజీపేట, జనవరి 24: కాజీపేట రైల్వేస్టేషన్‌ను ఎయిర్‌పోర్టు స్థాయిలో అభివృద్ధి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అనిల్‌కుమా ర్ జైన్ తెలిపారు. కాజీపేటలో బుధవారం రైల్వే పాలీక్లినిక్ అప్‌గ్రేడెడ్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే ఆస్పత్రిలో ఐదు వేల మంది రైల్వే కార్మికులు, ఐదువేల మంది రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబాలతో సహా సుమారు ఇరవై వేల మంది వైద్య సేవలు వినియోగించుకుంటున్నారన్నారు. అందుకోసం పాత భవనం తోపాటు నూతనంగా నిర్మించిన అప్‌గ్రేడ్ ఆస్పత్రి భవనం ప్రారంభించామన్నారు. ఈ ఆస్పత్రిలో మహిళలకు, పురుషులకు ప్రత్యేక వార్డులతోపాటు ఇతర అధునాతన మెడికల్ యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా రైల్వే రిటైర్డ్ ఉద్యోగులకు కంటికి సంబంధించిన సమస్యలు రావడంతో ప్రత్యేక కంటి వైద్యులను ఏర్పాటు చేస్తామని, అప్పటివరకు మరో ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేసే విషయం చర్చిస్తున్నామన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి గతంలో కేటాయించిన ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించామని జీఎం పేర్కొన్నారు. మరో రూ.20కోట్లు నిధులు కేటాయించి ప్రత్యేక బుకింగ్ కౌంటర్లు, ఏసీ వెయిటింగ్ హాల్స్, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి తదితర పనులు చేపడుతున్నామన్నారు. కాజీపేట, కాజీపేట టౌన్‌స్టేషన్ మీదుగా ప్రత్యేక రైళ్లు నడిపించేందుకు ప్రత్యేక ప్రణాళికలు చేస్తున్నామన్నారు. అనంతరం ఫిట్‌లైన్‌లను, లోకోపైలెట్‌ల కార్యాలయాలను తనిఖీలు చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. జీఎం వెంట డీఆర్ఎం భరతేశ్ కుమార్ జైన్, ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ సీకే వెంకటేశ్వర్లు, సీఎంఎస్ అనురాధరెడ్డి, సీనియర్ డీఎం టీఆర్‌డీ వాసిమ్‌పాషా, డీవోఎం సురేశ్‌రెడ్డి, అన్ని వింగ్‌ల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించండి..

రైల్వే కార్మికులకు ప్రత్యేక కంటి వైద్యుడిని ఏర్పాటు చేయాలని, సబ్ డివిజన్ స్థాయిలో ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్ సౌకర్యం కల్పించాలని, రైల్వే జీఎంను కలిసి కార్మిక నాయకులు విన్నవించారు. రైల్వే జీఎంను కలిసిన వారిలో మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, తెలంగాణ రైల్వే ఉద్యోగుల జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, నాయకులు సదానందం, సీసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస యాదవ్, జానీ, అక్బర్ తదితరులు ఉన్నా రు. కాగా, జీఎం అనిల్‌కుమార్ జైన్ బుధవారం కాజీపేట పర్యటన సమాచారాన్ని స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి ప్రొటోకాల్ అధికారులు సమాచారం ఇవ్వకపోవడం సరికాదని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి ఎమ్మీ అంకూస్ విమర్శించారు.



నూతనంగా ప్రారంభమైన రైల్వే ఆస్పత్రి

రామప్ప సరస్సులోకి దేవాదుల నీరు



సరస్సులోకి వస్తున్న దేవాదుల నీరు

వెంకటాపూర్(రామప్ప), జనవరి 24: మండలంలోని పాలంపేట గ్రామంలో రామప్ప సరస్సులోకి దేవాదుల నీటిని ఇరిగేషన్ అధికారులు బుధవారం విడుదల చేశారు. ఈసందర్భంగా డీఈ రవీందర్ మాట్లాడుతూ యాసంగి పంట కోసం భీంఘన్‌పూర్ పంపుహౌస్ నుంచి ఒక మోటారు ద్వారా రామప్ప సరస్సులోకి రెండు టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. రామప్ప నుంచి పాకాల, రంగాయచెరువు, గణపసముద్రంకు నీటిని తరలిస్తున్నట్లు వివరించారు. రామప్ప సరస్సులో 30 అడుగుల నీటి సామర్థ్యం ఉండేలా సుమారు 60 రోజులపాటు నీటిని సరస్సులోకి పంపింగ్ చేయనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సుల ప్రారంభం



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కాకతీయఖని, జనవరి 24: భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన రెండు నూతన బస్సులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, వాటిలోనే ప్రయాణించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మేడారం జాతరకు వెళ్లే మహిళా భక్తులకు కూడా ఈ పథకం వర్తిస్తుందన్నారు. డిపోలో ఇప్పటికే 76 బస్సులు ఉండగా ఆర్టీసీ యాజమాన్యం మరో రెండింటిని అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఇందులో ఒకదాన్ని భూపాలపల్లి నుంచి భద్రాచలం, మరోదాన్ని భూపాలపల్లి నుంచి మేడారం రూట్లలో నడిపించనున్నట్లు డీఎం లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు జి.ఎస్.రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్టు

రేగొండ, జనవరి 24 : గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారని సీసీఎస్ సీఐ పులి వెంకట్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలానికి చెందిన పోడియం రమేష్, ఉప్పు సాయి, కణతి రమణ రేగొండ మండల కేంద్రం శివారు తిరుమలగిరి ఆర్చ్ వద్ద పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారని తెలిపారు. వారిని విచారించగా మూడు కిలోల ఎండు గంజాయి లభించిందని తెలిపారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఈ వ్యవహారంలో సూత్రధారి రమేష్ అని, అతడు కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. మరో ఇద్దరు డ్రైవర్లుగా పని చేస్తున్నారని చెప్పారు.

జోరుగా ముందస్తు మొక్కులు

మేడారంలో భక్తుల రద్దీ

మేడారం, జనవరి 24 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం కోలాహలంగా మారింది. వనదేవతలు సమక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. లక్షల మందికి పైగా తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనున్న నేపథ్యంలో భక్తులు వనదేవతలను ముందస్తుగా దర్శించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించారు. కల్యాణకట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. సమ్మక్క, సారలమ్మల నామాలను స్మరించుకుంటూ గద్దెలకు చేరుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ కొబ్బరికాయలు బంగారం(బెల్లం), చీరెలు, సారెలు సమర్పించుకున్నారు. కోరికలు తీరాలని తల్లులను వేడుకున్నారు. అనంతరం మేడారం పరిసరాల్లో వసతి గృహాల్లో, చెట్ల కింద విడిది చేసి వంటలు చేసుకున్నారు. బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేసి రోజంతా గడిపారు. సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు.



జంపన్న వాగు వద్ద స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



వనదేవతలను దర్శించుకుంటున్న ఎన్నికల కమిషనర్ పార్థసారథి



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

దర్శించుకున్న ఎన్నికల సంఘం కమిషనర్

మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు, దేవాదాయ శాఖ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గద్దెలకు చేరుకున్న కమిషనర్ వనదేవతలకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం సమర్పించారు. పూజారుల నుంచి అమ్మవార్ల ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పూజారులు కండువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ, తాడ్వాయి తహసీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం పనుల్లో జాప్యం చేయొద్దు

దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్

ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష

మేడారం, జనవరి 24 : మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్ అన్నారు. వనదేవతల గద్దెల ప్రాంగణంలోని షెడ్డులో బుధవారం ఆయన ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో పురోగతి కనిపించడం లేదని అహనం వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న పనుల్లో అలసత్వం చేయొద్దన్నారు. అవసరమైతే మానవ వనరులను పెంచుకొని పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రాకాహారం, సాలహారం పెయింటింగ్, లైటింగ్ పనులతోపాటు క్యూలైన్ల మరమ్మతులను ఈనెల 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గద్దెల వద్ద గ్రిల్స్ విస్తరణ పనులను వెంటనే ప్రారంభించి ఫిబ్రవరి 10 వరకు పూర్తి చేయాలన్నారు. మహాజాతరకు ముందస్తుగానే భక్తులు అధిక సంఖ్యలో మేడారం వస్తున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. భక్తులు నిలువెత్తుల బంగారం(బెల్లం) నేరుగా సమర్పించుకునేలా కన్వేయర్ బెల్ట్ పనులను




సమావేశంలో మాట్లాడుతున్న ఎండోమెంట్ కమిషనర్ అనిల్ కుమార్

మిగతా 8వ పేజీలో...

పాలకుర్తికి అరుదైన గౌరవం

తెలంగాణ శకటంలో వీరనారి ఐలమ్మ విగ్రహం

పాలకుర్తి, జనవరి 24 : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నడుం భిగించి విస్నూరు దేశ్‌ముఖ్‌పై తిరుగుబాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మకు అరుదైన గౌరవం దక్కింది. న్యూ ఢిల్లీలో ఈ నెల 26న జరిగే గణతంత్ర వేడుకల్లో తెలంగాణా శకటం ప్రదర్శనకు చోటు దక్కగా, దానిలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహంతో శకటం ప్రదర్శించనున్నారు. 2015, 2020 సంవత్సరాల అనంతరం ఈ సంవత్సరమే తెలంగాణా శకటానికి అవకాశం దక్కగా ఈ ఏడాదితో పాటు వచ్చే మరో రెండేళ్ల పాటు కూడా ఐలమ్మ విగ్రహంతో కూడిన తెలంగాణ శకటం ప్రదర్శనకు అనుమతి లభించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తెలంగాణలో పాఠశాల విద్యలో ఐలమ్మ జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చారు. భావి తరాలకు ఐలమ్మ చరిత్ర తెలిసేలా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర శకటంలో వీరనారి ప్రతిమను ఉంచడం పట్ల పాలకుర్తి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం

జాకారం వైటీసీలో గిరిజన వర్సిటీ తరగతులు



ట్రైబల్ వర్సిటీ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న సెక్రటరీ శరత్, సెంట్రల్ వర్సిటీ అధికారులు, కలెక్టర్ ఇలా త్రిపాఠి

గట్టమ్మ వద్ద స్థలాన్ని పరిశీలించిన ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ శరత్

ములుగు కలెక్టరేట్, జనవరి 24: జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో గిరిజన యూనివర్సిటీ తరగతులను తాత్కాలికంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ ఎ.శరత్ వెల్లడించారు. బుధవారం ఆయన హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ రిజిస్ట్రార్ దేవేష్‌నిగమ్, జాయింట్ రిజిస్ట్రార్ అభిషేక్ కుమార్‌తో కలిసి ములుగు సమీపంలోని గట్టమ్మ దేవాలయ పరిసరాల్లో కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. మ్యాపు ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థలం విస్తీర్ణం, భౌగోళిక అనుకూలతలు, తరగతుల నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్‌తో చర్చించారు. జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం కోసం ప్రభుత్వం మొత్తం 337ఎకరాలను సేకరించినట్టు తెలిపారు. ఈ భూమిని గిరిజన సంక్షేమ శాఖకు బదలాయించడం కూడా పూర్తయ్యిందన్నారు. తరగతులను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట హెచ్‌సీయూ జాయింట్ డైరెక్టర్ కల్యాణ్‌రెడ్డి, ములుగు ఆర్డీవో కె.సత్యపాల్‌రెడ్డి, సీపీడబ్ల్యూడీ ఏఈ జె.నవీన్, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ జూనియర్ లైన్‌మెన్ పరీక్ష తేదీలు ఖరారు

నయింనగర్, జనవరి 24: టీఎస్ఎన్పీడీసీఎల్ పరిధి ఉమ్మడి వరంగల్ ఆపరేషన్ సర్కిల్‌లో జూనియర్ లైన్‌మెన్ నియామకం నోటిఫికేషన్ 2018వ సంవత్సరం జనవరి నెలలో విడుదలైంది. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు 2024 ఫిబ్రవరి 1, 2వ తేదీలలో జూనియర్ లైన్‌మెన్ అర్హులైన అభ్యర్థులకు విద్యుత్ స్తంభం ఎక్కే పరీక్ష, విద్య అర్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఉదయం 9గంటలకు ములుగురోడ్‌లోని నార్త్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)కి విధిగా హాజరుకాగలరని టీఎస్ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కే. వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యక్తిని బెదిరించి గొలుసు, సెల్ అపహరణ

నయింనగర్, జనవరి 24: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలసముద్రానికి చెందిన డేగల అంజనేయ ప్రసాద్ అనే వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించి అతడి నుంచి బంగారు గొలుసు, మొబైల్‌ను సోమవారం సాయంత్రం అపహరించారు. సుబేదారి సీఐ మహ్మద్ అబ్దుల్ షూకూర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ బాలసముద్రం ప్రాంతానికి చెందిన డేగల అంజనేయ ప్రసాద్(55) అనే వ్యక్తి హనుమకొండ కిషన్‌పురలోని గీతాంజలి డిగ్రీ కళాశాలలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తాడు. ఈ క్రమంలో అంజనేయప్రసాద్ తన పని మీద ఖమ్మం వెళ్లి తిరిగి సోమవారం సాయంత్రం సుమారు 4గంటల ప్రాంతంలో హనుమకొండ బస్టాండ్‌కు వచ్చాడు. బాధితుడు తన ఇంటికి వెళ్లాలని ఆటోకోసం చూస్తుండగా ఆటో దొరకకపోవడంతో నడుచుకుంటూ ఏషియన్‌మాల్ మీదుగా వెళుతుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు వెనుక నుంచి వచ్చి కత్తితో బెదిరించి తన మెడలో ఉన్న రూ.60,000 విలువ గల బంగారు గొలుసు, రూ.12,000 విలువ గల రెడ్‌మీ సెల్‌ను అపహరించినట్లు సీఐ తెలిపారు. బాధితుడు అంజనేయప్రసాద్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ షూకూర్ తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో ప్రతిభాపాటవ పరీక్ష

హనుమకొండ రూరల్, జనవరి 24: తెలంగాణ విద్యాశాఖ, సాంఘిక శాస్త్రఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాంఘికశాస్త్రంలో ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 30వ తేదీలోపు పరీక్ష నిర్వహించి ప్రతీ పాఠశాల నుంచి ఎంపికైన ఇద్దరు విద్యార్థుల వివరాలను పరీక్ష నిర్వాహకులు సోషల్‌ఫోరం బాధ్యులకు అందజేయాలన్నారు. ఈ పోటీలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషులో, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లీష్ మధ్యమంలో మాత్రమే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షనిర్వహణకు సంబంధించి వివరాల కోసం జిల్లా సోషల్ ఫోరం బాధ్యులు అలిగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి 98498 34110, సతీష్ ప్రకాష్ 97001 04075 సెల్‌నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
ఫోరం మాల్ - కూకట్‌పల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
గలేరియా - పంజాగుట్ట
ఐకాన్ - హైటెక్‌సిటీ
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి
ఆట్రియమ్ - గచ్చిబౌలి
ఎస్2 సోమ - మల్లాపూర్
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్
ఎం.పి మాల్ - కాచిగూడ
జిఎస్ఎమ్ - మదీనగూడ
నెక్లెస్ సత్వ - కవాడిగూడ
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్
మంజీరామాల్ - కూకట్‌పల్లి
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి
మంత్రామాల్- అత్తాపూర్
సుధా - శాలిబండ
డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
సినీ ప్లానెట్ - కొంపల్లి
ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఏషియన్ రాధిక - కాప్రా
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
మిరాజ్ సినిమాస్ - బాలానగర్
మిరాజ్ సినిమాస్ - చందానగర్
లక్ష్మీనరసింహ - మియాపూర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
మూవీటైమ్ - అమీర్‌పేట
ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
షా షహెన్‌షా - చింతల్
లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
మూవీమ్యాక్స్ - మౌలాలి
జె.పి.సినిమాస్ - చందానగర్

'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటుచేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్య
- కాంగ్రెస్‌కు ఓటేసినవారు బాధపడుతున్నారు
- ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిలింది చిన్న దెబ్బే
- తప్పుడు హామీలతో ప్రజల్ని నమ్మించిన రేవంత్ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో.. ఓటుతో కొడతారో రైతులు ఆలోచించాలి
- ఎన్నికల్లో సోషల్ మీడియా కీలకం: కేటీఆర్

కరీంనగర్ టౌన్, జనవరి 24: తొందర్లోనే కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ నాయకులు కూడా అనుకోలేదని, అందుకే బస్సు ఫ్రీ, బంగారం ఫ్రీగా ఇస్తామంటూ అమలుకు నోచుకోని హామీలు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేసిన వారంతా ఇప్పుడు బాధపడుతున్నారని చెప్పారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన పార్లమెంటరీ నియోజకవర్గ బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్నదెబ్బ మాత్రమే తగిలిందన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతోనే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ అన్నారు. ప్రజల తీర్పును అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు


సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధాన మంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో‌స్‌లో వచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?

- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాముల వారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను

సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్లు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.

జాతర నిధులు దుర్వినియోగం

జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి



విలేకరులతో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

మేడారం, జనవరి 24 : మహా జాతరలో భక్తుల సౌకర్యార్థం మంజూరు చేసిన నిధులను అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని ములుగ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆరోపించారు. మేడారంలో ఆమె బుధవారం పర్యటించారు. మహాజాతర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అధికారులు తప్పుడు ప్రణాళికలతో మేడారం నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. తక్కువ పనులను ఎక్కువ ఖర్చుతో చేస్తున్నారని, శాశ్వత పనుల పేరుతో కాంట్రాక్టర్ల జేబులు నింపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తక్కువ సమయం ఉందనే సాకుతో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు పూర్తి చేస్తున్నారని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు చేపట్టిన ఊరట్టం కాజ్‌వే పనులే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఊరట్టం నుంచి కాల్వపల్లికి మట్టి రోడ్డుకు పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖలు మంజూరు చేశారని, రెండు శాఖల మధ్య సమన్వయం లోపించడానికి ఇదే నిదర్శనమని విమర్శించారు. ఎవరు ఏ పని చేస్తున్నారో తెలియకుండా నివేదికలు రూపొందించిన అధికారులు తక్కువ ఖర్చులతో చేయాల్సిన పనులకు ఎక్కువ నిధులు కేటాయించారని అన్నారు. ఈ దుర్వినియోగంపై విచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే పనులు ఎలా చేపడతున్నారని ప్రశ్నించారు. ఆమె వెంట తాడ్వాయి ఎంపీపీ గొంది వాణిశ్రీ, మేడారం సర్పంచ్ చిడెం బాబురావు, ఊరట్టం సర్పంచ్ శ్రీధర్, వెంగళాపూర్ సర్పంచ్ గడ్డం అరుణ, బీఆర్ఎస్ నాయకులు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, సురేష్, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ శబరీశ్

మేడారం, జనవరి 24 : ములుగు ఎస్పీ శబరీశ్ తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం పర్యటించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న బందోబస్తును పర్యవేక్షించారు. వనదేవతల గద్దెలు, క్యూలైన్లు, కోర్ ఏరియాలు, రద్దీ ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలు, చెక్‌పోస్టులను సందర్శించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేపట్టాలని డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై శ్రీకాంత్ రెడ్డిని ఆదేశించారు. మహా జాతరకు ముందుగానే వనదేవతల ప్రత్యేక రోజుల్లో, వారంతపు సెలవులో భక్తుల సంఖ్య అధికంగా పెరుగుతుందని, అప్రమత్తంగా ఉంటూ వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేయాలన్నారు.



భక్తుల దర్శనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శబరీశ్

వైద్య శిబిరంలో విశేష సేవలు

మేడారంలో ఉచిత వైద్య సేవలను భక్తులు వినియోగించు కుంటున్నారు. మహాజాతరకు ముందస్తుగా వస్తున్న భక్తులకు వైద్య ఆరోగ్య శాఖ సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య మేడారం గద్దెల పరిసరాల్లోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో వైద్య శిబిరాన్ని ఈనెల 15న ప్రారంభించారు. ఇప్పటి వరకు 800 మంది భక్తులు ఓపీ సేవలను వినియోగించుకొని మందులు తీసుకున్నారు. ఒక్క బుధవారం 94 మంది భక్తులు వైద్య సేవలను పొందారని వైద్యులు తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ వరప్రసాద్, సిబ్బంది సుజాత, కనకలక్ష్మి, ఛాయదేవి, అనిత, సుజాత పాల్గొంటున్నారు.



భక్తులకు ఓపీ సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

మేడారం పనుల్లో జాప్యం చేయొద్దు

(5వ పేజీ తరువాయి)

వెంటనే ప్రారంభించి ఫిబ్రవరి 15లోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి రాజేంద్రం తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన ఐటీడీఏ పీవో

మేడారం మహా జాతర అభివృద్ధి పనులను ఐటీడీఏ పీవో అంకిత్ పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఇరిగేషన్ పనులు, మహిళలు దుస్తులు మార్చుకొనే గదులు, ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల పూడికతీత, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు తదితర సౌకర్యాలను భక్తులకు అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి భారీ సంఖ్యలో వస్తున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. కంపార్టుమెంట్లు, క్రాస్‌బాండ్లు, ఇసుక చదును పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఊరట్టం పరిసరాల్లోని తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. సరిపడా నీటి సరఫరా చేపట్టాలని, విద్యుద్దీపాల ఏర్పాటు చేయాలని అన్నారు. పార్కింగ్ స్థలాల వద్ద తాగు నీటి సౌకర్యాలు, లైటింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఆదివాసీ మ్యూజియం పెయింటింగ్ పనులు ప్రారంభించాలన్నారు. ఆదివాసీ చరిత్ర తెలిపే బొమ్మలకు పెయింటింగ్, ఓపెన్ హంపీ థియేటర్ మరమ్మతుల పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట ఏపీవో వసంతరావు, ఇంజనీరింగ్ అధికారులు శంకర్, చందర్, సతీష్ తదితరులు ఉన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్

ములుగు కలెక్టరేట్, జనవరి 24: మండలంలోని జంగాలపల్లి గ్రామశివారులో గల ఎర్రిగట్టమ్మ దేవాలయం ఆవరణలో అటవీశాఖ అధికారులు రెండో విడత కార్యక్రమంలో భాగంగా బుధవారం క్లీన్‌అండ్‌గ్రీన్ నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు, సిబ్బంది దేవాలయం ఆవరణలో ఉన్న చెత్తాచెదారంతోపాటు ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. అనంతరం ములుగు ఎఫ్‌డీవో జోగేందర్ మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ప్లాస్టిక్ రహిత జాతరగా జరగాలని, ఇందుకోసం జాతరతోపాటు జాతీయ రహదారిని అనుకుని ఉన్న దేవాలయాల పరిసరాల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను ఎవరూ పడవేయొద్దని కోరారు. ముఖ్యంగా భక్తులు విడిదిచేసే ప్రాంతాల్లో చెల్లాచెదురుగా ప్లాస్టిక్ కవర్లను పడవేయొద్దని అన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో శంకర్‌తోపాటు ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● గోవిందరావుపేట: అటవీశాఖ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది మండలంలోని లక్నవరం సరస్సు ప్రాంతంలో బుధవారం క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సరస్సు ప్రాంతంతోపాటు రోడ్డుకిరు వైపులా ఉన్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ వస్తువులను సేకరించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను పురస్కరించుకుని లక్నవరం సందర్శించే పర్యాటకులు ప్లాస్టిక్ వస్తువులను తీసుకురావద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పస్రా ఎఫ్ఆర్‌వో మాధవిశీతల్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో శోభన్, ఎఫ్ఎస్‌వోలు వేణుగోపాల్, సుజాత, ఎఫ్‌బీవో దీప్‌లాల్, రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కాటారం, జనవరి 24: కుటుంబ కలహాలతో ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుమ్మళ్లపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చల్ల మల్లయ్య(57)కు ఇద్దరు కూతుళ్లు అనసూయ, సువర్ణ, కుమారుడు లక్ష్మణ్ ఉన్నారు. కూతుళ్లిద్దరికి వివాహం కాగా కుమారుడికి కాలేదు. లక్ష్మణ్ 2018, 2023 సాధారణ ఎన్నికల్లో మంథని నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేశాడు. మూడేళ్ల క్రితం మల్లయ్య భార్య లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. మల్లయ్య వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లక్ష్మణ్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేసి ఇటీవల మానేసి ఇంటికి వచ్చాడు. 10 రోజుల క్రితం ఆర్థిక విషయాలపై తండ్రీకొడుకుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో లక్ష్మణ్ ఇంట్లో నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోయాడు. మల్లయ్య పలుమార్లు ఇంటికి రమ్మని ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో మనస్తాపం చెందిన మల్లయ్య ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం పాలు పోసే వ్యక్తి వచ్చి చూసేసరికి విగతజీవుడై వేలాడుతూ కనిపించాడు. మృతుడి కూతురు అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

పట్టభద్రులు ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

మొగుళ్లపల్లి, జనవరి 24: మండలంలోని పట్టభద్రులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సునీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఓటుహక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 6లోగా ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెంకటాపురం(నూగూరు), జనవరి 24: మండలంలో విద్యుత్‌లైన్ల మరమ్మతు జరుగనున్నందున ఈనెల 25న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ సునీల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి తమకు సహకరించాలని కోరారు.

మేడారం ట్రస్టుబోర్డులో ఆదివాసీలకు స్థానం కల్పించాలి

వెంకటాపురం(నూగూరు), జనవరి 24: మేడారం ట్రస్టుబోర్డులో ఆదివాసీలకు స్థానం కల్పించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కణితి వెంకటకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండలకేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర సమీపిస్తున్న తరుణంలో ఆదివాసీలతో కూడిన నూతన ట్రస్టుబోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈసమావేశంలో నాయకులు మట్టి రమేష్, ఆనంద్, ఆలెం నారాయణ, కోరం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ

మహదేవపూర్, జనవరి 24: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో ఖమ్మంలో జరిగే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహా సభల పోస్టర్‌ను ఆ సంఘం ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి బుధవారం ఆవిష్కరించారు. మండలంలోని బాలికల పాఠశాల, బాలుర పాఠశాల, కేజీబీవీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.జగపతిరావు, ఉపాధ్యక్షుడు బొల్లం సతీష్, కార్యదర్శి నరేష్, నేతలు కుమార స్వామి, భాస్కర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్‌వైర్ చోరీ

కాటారం, జనవరి 24: మండలంలోని దన్వాడ, ఆదివారంపేట జీపీల పరిధిలో గుర్తుతెలియని దుండగులు రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైర్‌ను చోరీ చేశారు. పొలాల్లో ఉన్న రెండు 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను రెండు రోజుల క్రితం పగులగొట్టి వాటి లోపల ఉన్న కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లేసరికి అవి కిందపడేసి పగులగొట్టి కనిపించాయి. దీంతో వారు లైన్‌మన్ ప్రవీణ్, ఏఈ మేఘనాథ్‌కు సమాచారం ఇచ్చారు. అధికారులు సంఘటన స్థలాలను పరిశీలించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌కో ఏఈ మేఘనాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ బుధవారం వెల్లడించారు.

కాళేశ్వరాలయంలో గిరిజన శాఖ కార్యదర్శి పూజలు

మహదేవపూర్, జనవరి 24: మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర గిరిజన శాఖ కార్యదర్శి శరత్ బుధవారం సందర్శించారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వామివారి శేష వస్త్రాలతో ఆయన్ను సన్మానించారు. స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.



గిరిజన శాఖ కార్యదర్శికి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అర్చకుడు

జీపీడీపీపై సమీక్షా సమావేశం

కాటారం, జనవరి 24: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జీపీడీపీ (గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక), బీపీడీపీ(బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)పై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శంకర్‌నాయక్ మండలంలోని మండల స్థాయి, గ్రామ స్థాయి లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశమయ్యారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి మండల, పంచాయతీల అభివృద్ధి పనులను గుర్తించారు. మండలంలో సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమావేశ ంలో ఎంపీవో ఉపేంద్రయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అరుణ, వీణ, ఏపీవో వెంకన్న, ఐకేపీ సీసీలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లిటౌన్, జనవరి 25: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని కాశీంపల్లిలో పెద్దమ్మ గుడి ప్రహరీ నిర్మాణ పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ కోసం భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత పాలకులు శంకుస్థాపనలకు మాత్రమే పరిమితమయ్యారని విమర్శించాఉ. తాను మాత్రం పనులు చేసి చూపిస్తానని అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ వారి భవన నిర్మాణ పనులు ఐదేళ్లుగా ఆగిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రిలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ప్లేట్‌లెట్స్‌మిషన్, ఇతర సౌకర్యాలతో పాటు అన్ని రకాల ప్రత్యేక వైద్య నిపుణులు ఇక్కడ అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, కౌన్సిలర్లు కొత్త హరిబాబు, ముంజాల రవీందర్, తిరుపతి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు రాజిరెడ్డి, మూర్తి, కృష్ణమోహన్, సతీష్‌రెడ్డి, జోరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల ఆత్మీయ సన్మాన సభకు ఆల్ పెన్షనర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.కరుణాకర్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.7లక్షలు కోట్లు అప్పు చేసి అందరికీ తీవ్ర నష్టం జరిగేలా చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అలా కాకుండా అన్ని సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి అవినీతి లేకుండా సమస్యలు పరిష్కరిస్తుందని అన్నారు. సీఆర్ఎస్, డీఎంఎఫ్‌టీ నిధులు ఉన్నాయని వాటిని సమస్యల పరిష్కారం కోసం వినియోగిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ రాష్ట్ర నాయకులు సీతారాం, బ్రహ్మయ్య, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుభాకర్‌రెడ్డి, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సేవానాయక్, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత సదరం సర్టిఫికెట్లు ఇస్తాం

భూపాలపల్లి కలెక్టరేట్ : అర్హులైన వికలాంగులకు శాశ్వత సదరం సర్టిఫికెట్ ఇచ్చేలా కృషి చేస్తామని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన సదరం క్యాంపును ఆయన ప్రారంభించారు. అర్హులైన వారు మాత్రమే సదరం సర్టిఫికెట్ల కోసం పరీక్షలు చేయించుకోవాలన్నారు. సదరం స్లాట్ బుక్ కాని వికలాంగుల కోసం ఫిబ్రవరి, మార్చి నెలల్లో కలెక్టర్‌తో మాట్లాడి క్యాంపులను ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. సదరం క్యాంపునకు మొత్తం 189 స్లాట్ బుక్ చేసుకుంటే 172 మంది మాత్రమే పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్ కుమార్, డీర్డీవో పురుషోత్తం, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో మాట్లాతున్న ఎమ్మెల్యే గండ్ర

పార్టీ కార్యకర్త సమావేశం

గణపురం : చెల్పూరులోని లక్కం జయచంద్ర గార్డెన్స్‌లో కాంగ్రెస్ మండల స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పురాతన ఆలయాలైన కొటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, బుగులోని వెంకటేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామని తెలపారు. ఏర్పాటు చేయాల్సిన రింగ్‌రోడ్డు గాంధీనగర్, బుర్రకాయలగూడెం మీదుగా తీసుకువచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి పేదవాడి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెల్పూరు పీఏసీఎస్ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ అశోక్, కో ఆప్షన్ సభ్యుడు చోటేమియా, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పొట్ల నగేష్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ మలహల్‌రావు, మాజీ సర్పంచ్ పద్మవెంకన్న, మాజీ జడ్పీటీసీ ముత్యాల రాజయ్య, మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భువన చందర్, పీఏసీఎస్ డైరెక్టర్ కావటి రవి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉత్తమ ఉద్యోగులు వీరే..

కాకతీయఖని, జనవరి 24: సింగరేణి భూపాలపల్లి ఏరియాలో పనిచేస్తున్న ఉత్తమ ఉద్యోగుల జాబితాను ఆ సంస్థ అధి కారులు బుధవారం వెల్లడించారు. ఈనెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా వీరిని సన్మానించనున్నారు. ఉత్తమ ఉద్యోగు లుగా ఎంపికైన వారిలో కేటీకే 1వ గనిలో హెడ్ ఓవర్‌మెన్‌గా పనిచేస్తున్న ఎండీ.రాజ్ మహ్మద్, జనరల్ మజ్దూర్ కె.శ్రీనివాస్, కేటీకే 5వ గనిలో హెడ్ ఓవర్‌మన్ ఇ.రవీందర్, టిండాల్ బి.కొంరయ్య, కేటీకే 6వ గని నుంచి ట్రామర్‌గా పనిచేస్తున్న వి.భూమయ్య, ఫిట్టర్ హెల్పర్ ఎం.బాలయ్య, కేటీకే 8వ గనిలో ఫోర్‌మన్‌గా పనిచేస్తున్న జి.రాజు నాయక్, ఎస్‌డీఎల్ ఆపరేటర్ శ్రీనివాస్, ఓసీ-2 ప్రాజెక్టులో హెడ్ ఓవర్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.లచ్చులు, ఏసీఎం జి.కుమా రస్వామి, ఓసీ-3 ప్రాజెక్టులో జనరల్ మజ్దూ ర్‌గా పనిచేస్తున్న ఎస్.కృష్ణారెడ్డి, ఫిట్టర్ బి.మహేందర్‌రావు ఉన్నారు. వీరిని భూపా లపల్లి ఏరియాలోని జీఎం కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా సన్మానించనున్నారు. అలాగే బెస్ట్ సింగరేణీయన్‌గా భూపాలపల్లి ఏరియా నుంచి కేటీకే ఓసీ-3 సర్వేయర్ కె.రమేష్, ఉత్తమ అధికారిగా కేటీకే ఓసీ-2 ప్రాజెక్టు ఆఫీసర్ టి.వెంకట్రామ్‌రెడ్డిని ఎంపిక చేశారు. వీరిని కొత్తగూడెంలో సీఎండీ బాలరాం నాయక్ సన్మానించనున్నట్టు ఏరియా అధికార ప్రతినిధి తుకారాం తెలిపారు

పరిపాలన వికేంద్రీకరణతో మెరుగైన ఫలితాలు : కలెక్టర్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 24: పరిపాలన వికేంద్రీకరణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధిస్తామని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. పరిపాలన వికేంద్రీకరణపై సమీక్షించారు. మండల స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, ఆస్పత్రులను తనిఖీ చేసి వాటి పనితీరును మెరుగుపర్చాలన్నారు. ఎంపీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఏపీవో, ఎంపీఎం ఎంఈవో, ఐకేపీ సీసీ, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తనిఖీలు నిర్వహించి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. జిల్లాలో 644 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, వాటికి కుర్చీలతోపాటు గుడ్లు పెట్టేందుకు ర్యాంకులు అందించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీల సమయంలో తల్లీబిడ్డల ఆరోగ్యం, పౌష్టికాహారం పంపిణీ, పాఠశాలల తనిఖీల సమయంలో ఉపాధ్యాయులు సకాలంలో హాజరవుతున్నారా..? పరిశీలించాల న్నారు. విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతులను తనిఖీ చేయాలన్నారు. రేగొండ పీహెచ్‌పీకి దేశంలోనే మంచి పేరు సాధించామని, ప్రైవేటు దీటుగా జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఆస్పత్రులు, సబ్‌సెంటర్లను తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

రెండు ఇసుక లారీల సీజ్

మంగపేట, జనవరి 24: మండల పరిధి కమలాపురం శివారులోని బూర్గంపహాడ్- ఏటూరునాగారం ప్రధాన రహదారిపై స్థానిక ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు బుధవారం రాత్రి వాహనా లను తనిఖీలు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకొత్తగూడెం క్వారీ నుంచి హైదరాబాద్ వైపు అధిక లోడ్‌తో వెళ్తున్న లారీలను పరిశీలించగా అనుమతికి మించి ఇసుక రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఈ రెండు లారీలను సీజ్ చేసి స్థానిక పోలీస్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఏటూరునాగారంలో వైద్య శిబిరం

ఏటూరునాగారం, జనవరి 24 : జాతీయ బాలిక దినోత్సవాన్ని పురష్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమానికి నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వస్థ , ఆర్‌బీఎస్‌కే ఏటూరునాగారం మొబైల్ బృందం సభ్యులు బాల బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్న బాల బాలికలకు ఐరన్, ఫోలిక్ యాసిడ్ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భగవద్గీత, ఆర్‌ఎస్‌కే బృందం డాక్టర్లు బి. నరహరి, సుజాత, ఫార్మసిస్ట్ భాస్కర్, ఏఎన్‌ఎం రజిని, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై సమీక్ష

మంగపేట, జనవరి 24: గ్రామాల అభివృద్ధిపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. వివిధ శాఖలక చెందిన అధికారులు హాజరై పలు అంశాలపై సమీక్షించారు. ఎంపీడీవో సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి రవి, ఈజీఎస్ ఏపీడీ వెంకటనారాయణ హాజరయ్యారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనులకు కార్యాచరణ రూపొందించారు. ఎంపీవో మమత, ఈజీఎస్ ఏపీవో సునీత తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు ఇసుక తెచ్చుకోవడానికి అనుమతి ఇవ్వాలి

తాడ్వాయి, జనవరి 24: మండలంలోని ఒడ్డుగూడెం ప్రజలు ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఇసుకను తెప్పించుకోవడానికి అనుమతి ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడు దుగ్గి చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నాయకులతో కలిసి ఒడ్డు గూడెం గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు(ఆర్‌డీటీ), గ్రామీణ అభివృద్ధి సేవాసంస్థ మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రజ లను మెరుగుపరచడానికి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. ఇందులో భాగంగా ఒడ్డుగూడెం గ్రామంలో ఉన్న 37 ఆదివాసీ కుటుంబాలకు డబుల్‌బెడ్‌రూం తరహాలో ఇళ్లు నిర్మిం చనున్నదని, ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన సిమెంటు, ఇనుము, కాంక్రీ ట్‌ను సంస్థ సమకూరుస్తుందని తెలిపారు. అయితే ఇసుకను తెచ్చుకోవడానికి వెళ్లిన గిరిజనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, దీంతో పునాది పనులు చేపట్టిన గిరిజనులు ఇబ్బం దులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏజెన్సీలో లభించే ఇసుకను గిరిజనులు ఉపయోగించుకునే హక్కు లేదా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏజెన్సీ ప్రాంతంలో పెసా చట్టాన్ని పటిష్టంగా అమలుపరిచి ఆదివాసీ ప్రజలకు ఉచితంగా ఇసుకను ఉపయోగించుకునే హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గొంది రాజేష్, శంకర్, రాంబాబు, చేల బాబు, ఆలెం లింగయ్య పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల ప్రారంభం

గోవిందరావుపేట, జనవరి 24: మండలంలోని పస్రాలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదేశాల మేరకు అభ్యుదయ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. సీతక్క మంత్రి అయిన మొదటినెలలోనే మినీ అంగన్‌వాడీ కేంద్రాలను పునరుద్ధరణ చేసి 14వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా అంగన్‌వాడీ కేంద్రాలుగా మారుస్తూ మొదటి సంతకం చేశారని అన్నారు. అదేవిధంగా మేడారం మహాజాతరకు రూ.100కోట్లు మంజూరు చేయించి అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేయడంలో ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. అలాగే ప్రతి మండలానికి అంతర్గత, సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.2కోట్ల50లక్షలను మంజూరు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, నాయకులు రస్పూత్ సీతారాంనాయక్, పన్నాల ఎల్లారెడ్డి, దాసరి సుధాకర్, కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, పులుగుజ్జు వెంకన్న, పెండెం శ్రీకాంత్, కణతల నాగేందర్‌రావు, దేపాక కృష్ణ, బద్దం లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న అశోక్